కథానిక

# అల్పత్వానికి పొలిమేరలు

కె. రామలక్ష్మి

ఇలాంటప్పుడే ఇది జరగడం అన్యాయం- ఈ శరత్కాలపు మిట్టమధ్యాహ్నం వేళ ఆకుల్లేని చెట్ల మోడులగుండా, ఆ ఏకాంత స్థలంలోనికి కొంచెం ఆలోచించుకుందామని త్వరితగతిని అతను పోయే సమయంలోనే-ఇలా జరగడం అన్యాయం. ఆ ఏటవాలు గుట్టమీదుగా గుంట ప్రక్కకి శీఘ్రంగా అతను పోతూంటే...పిల్లలిద్దర్ని చూశాడు.—గుంట అంచుమీద, గోలగా అరుచుకుంటూ ఆడుకుంటున్నారు. ముఖం చిట్లించుకున్నాడు...ఎవరూ పోరనుకున్న యీ నిర్జన స్థలంలోనికి తనకంటె ముందే యీ పిల్లలిద్దరూ వచ్చినందుకు. తిరిగి వెళ్లిపోవడానికి వెనుతిరిగాడు [illegible]తే. తక్షణం వినిపించింది. అరిచే ఆ పిల్లల కంఠధ్వని ఉత్తమ స్థాయినందుకొని ఆర్తనాదం అయింది. బోనున పడిన జంతువులా ఆ అరుపు! దబుక్కుమన్న నీటిశబ్దంకూడా అతను విన్నాడు.

ఆగేడు. చిరుచెమటలు పోశాయి అతనికి. అవును, ఆ ధ్వని నిజమే. ఆ పిల్లల్లో ఒకడు ఆ గుంటలో పడ్డాడు...ఆ గుంటలో ఎంత నాచు పెరిగిపోయిందో. అదంతా కాళ్ళకి తగులుకొని విదిలించుకోనేందుకు తన్నుకుంటున్నాడు. ఆశ్చర్యం! ఆ గుంటలో నీరు ఎంత లోతుందో! ఆ పిల్లాడి ముఖంమాత్రం కనిపిస్తూంది. పూర్తిగా మునిగిపోయాడు. రెండో పిల్లవాడు సాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు... మునిగిపోతూన్న వాణ్ణి పైకి లాగడానికి. గుంటగట్టుని నిలువుసా పడుకొని మునిగేవాని చెయ్యిపుచ్చుకుని శక్తికొలదీ లాగుతున్నాడు. ఏం లాభంలేదు. గుంట చాలా లోతు. ఆ పిల్లవాణ్ణి తియ్యాలంటే, ఎవరేనా పెద్దలు—దిగి తియ్యవలసిందే. ఓ క్షణం ఆగాడు అతను... పెదవులు కదులుతున్నాయి. కాని, ఆ రెండో పిల్లవాడు అతన్ని చూసి పిలిచేలోపల వెనుతిరిగి శీఘ్రంగా తన నడక సాగించాడు అతను...

...అతనలా వెళ్ళిపోవడంలో వింతలేదు. అతని లక్షణమే అంత...జీవితం అతను ఏ సంఘటననీ ధైర్యంగా ఎదుర్కోలేదు. ఇప్పుడలాంటి పని ప్రారంభించనూ లేదు. శీఘ్రంగా పోతూనే, తనని తను క్షమాపణ చెప్పుకుంటున్నాడు. "నేనేం చెయ్యకలను. నేనూ అంతే. మునిగిపోవలసిందే! నాకు యీత రాదే? నేను సహాయం చేస్తానని, ఎదురుచూడ్డం...ఆ రెండో పిల్లాడు పైకి లాగేస్తాడులే. అనవసరంగా బట్టలు తడిపేసుకోడం...నిజంగా అన్యాయం."

నిజంగానే అతని ఆరోగ్యం గురించి అతను తగిన జాగ్రత్తపడాలి మరి. గుండె దిట్టమైనది కాదు. నిజమేకదూ? దగ్గాడు. నడుస్తూనే దగ్గుతున్నాడు. గట్టిగా కాదు. గట్టిగా దగ్గితే, ఆ ధ్వని విని ఆ పిల్లడు పిలిస్తే!

అతను ఎప్పుడూ జాగ్రత్తగానే వున్నాడు-తన విషయాలనీ తన కోరికలనీ జాగ్రత్తగానే వుంచాడు. తన కరడుగట్టిన స్వార్థానికి సాధారణ విషయానుభవాన్ని దూరంగానే వుంచాడు మరి! దానికి కారణం అతని ముసలితల్లి ఏమో! నిజంగా తల్లి! ఎంతో జాగ్రత్తగా, తన ఒడిలో ఏ ఒడిదుడుకూ లేకుండా. రక్షిస్తూ పెంచుకుని వచ్చింది. ఆ తల్లికి తెలియకుండానే...అతని చిన్న నొప్పి ప్రపంచపు ఏ విషమపరిస్థితులకంటెకూడా ముఖ్యం అయినది...అన్న ఉద్దేశాలను నాటింది. అతను స్కూల్లో చదువుకునే రోజుల్లో కూడా, యీ ఉద్దేశాలు రూపుమాసిపోడానికి ఏం జరగలేదు. ఎంతో అందంగా ముద్దుగా వుండేవాడు. తన పని చక్కపెట్టుకుందికి ఎంతో ఆలోచనతో, ముచ్చటైన మార్గాలు కనిపెట్టేవాడు. కాని క్లాసులు పెరుగుతున్నకొద్దీ, యీ సువిశాల ప్రపంచంలో అతనూ, అతన్ని అధికంగా ప్రేమించే తల్లీ, యేకాక యితరత్రా అనేకం

వున్నా యన్న సంగత అవగాహన కాసాగింది. క్లాసులో తుదిస్థానానికి వచ్చాడు. ఎప్పుడూ ఎవ్వరూ ఎందుకూ అతన్ని ఘనంగా పొగడలేదు సరికదా, మొద్దుతనానికి ఉదహరించేవారు! మయూరపింఛంలాంటి అతని హృదయంలో కాకియీకలు,తలెత్తాయి. విచిత్రమైన పరిణామం వచ్చింది అతనిలో.

ఈ పరిస్థితులని ఎదిరించాడు- ఏ విధంగా? పన్నెండుగంటల వేళ-మెల్లిగా చేతిదెబ్బకొట్టి—ఒక్క డబ్బేకాదు-కంటికి ఏది కనిపిస్తే అది-ఎదుటి పిల్లలకి ఏది ఎక్కువ యిష్టమో అది-ఏమీ తెలియనివాడిలా మళ్ళీ క్లాసులో కూర్చునేవాడు. ఎవరూ అతన్ని అనుమానించలేదు. ఆ క్లాసులో అతను వున్నట్టే కాదసలు: లోపల్లోపల తన ఘనతకీ, ఎదుటివారి శక్తిహీనతకీ ఆనందించేవాడు. కక్షతీర్చుకున్నట్లు ఆనందించేవాడు. యీ పరిస్థితికి ఆటకట్టయింది ఒకనాడు. పెన్నుకత్తి, చేతిలో వుండగా ఎవరో అతన్ని దరిదాపు పట్టేశారు. కాని, యీ అనుమానం, ఎలాగేనా రాకుండావుండాలి. అందుకే ప్రక్కగానిల్చున్న కుర్రాడిజేబులో కనిపించకుండా జారవిడిచాడు దాన్ని. గుండెలు గట్టిగా కొట్టుకుంటున్నా, నిశ్చింతగా అవతలికి నడిచాడు. కాని, అంతకంటే దురదృష్టం ఏమంటే, ఆ జేబులో కత్తి పడేసిన కుర్రాడు బీద విద్యార్థి. స్కాలర్‌షిప్పులో చదువుకుంటున్నాడు. అతని జేబులో దొంగలించిన కత్తి దొరకగానే, అతనే దొంగిలించాడని, పిల్లలు తన్నడమే కాదు మేష్టరికి చెప్పారు. తత్ఫలితంగా అతని స్కాలర్‌షిప్పు పోయి- చివరకి చదువు కూడా పోయింది. ఆ పిల్లవాడు ఎంత ఏడ్చినా లాభం శూన్యం అయింది...

అతను యీ సంగతే పూర్తిగా మరిచిపోయాడు. అతని స్మృతిపథంమీద యీ సంఘటన ఏమాత్రం గుర్తులు ఒదలలేదు...యీ ఏకాంతస్థలానికి శీఘ్రగతిని పోతూన్న అతనికి అసలీ సంగతే గుర్తులేదు!... అతన్నిచూసి తరవాత ఆ పిల్లల్ని చూస్తే ఎవరేనా కోపగించుకుంటారు. కాని అతని తప్పుకాదది—అతను ఏమీ చెయ్యలేడు... కాని, ఎవరేనా తననిగురించి యిలా చులకనగా భావిస్తారంటే, నిజానికి అతనికి అసహ్యం వేసింది. అతన్ని అతనే మోసంచేసుకుందుకు, చాలా ఘనుడే అతను.

ఇదే అహంభావం అతన్ని విచిత్ర పరిస్థితిలోకి దించింది. తొలితారుణ్యపురోజులవి. ఆ పల్లెకి కొంచెందూరంలోవున్న ఫ్యాక్టరీ ఉద్యోగం సంపాదించాడు. తల్లి హృదయం తపించిపోయింది అతను అలా కష్టపడిపోతున్నందుకు. జీవితం గడిచిపోతోందికాని, ఏ స్నేహితులూ లేకపోవడం మూలాన్ని ఒక్కొక్కప్పుడు బాధగానేవుండేది. తల్లి మినహా, హాయిగా కబుర్లుచెప్పడానికెవరూ లేకపోడం, చాలాబాధగా తోచసాగింది.

స్త్రీసాంగత్యం కావాల తనకి. తనకి తగిన పిల్లకోసం గాలంవేసి వెతికి, చివరికి ఒకత్తెని పట్టాడు....సాయంత్రంవేళ, ఏకాంతంగా ఆలోచనలో మునిగి కూర్చుంది-ఆ అమ్మాయి. పదిహేడేళ్లుంటాయి. అందంగానే వుంది. విశాలమైన కళ్లు మరీ అందంగా వున్నాయి... ఆ పార్కు బెంచీమీద ఏకాంతంగా కూర్చునివుంది... అదే ఆమె స్నేహంచెయ్యడానికి సులభం అయింది... సినిమాలకి షికార్లకీ ఎంతో సరదాగాపోయివచ్చేవారు- ఆమెని అతను మంత్రముగ్ధగా చేశాడు. అతను ఎంతచెప్తే అంత. ఏం చెప్తే అదే. నిజానిజాలు కనిపెట్టలేని లేతవయస్సు ఆమెది. అంత అందమైన అతని అహంభావం నిజంగా గంభీరంగా తోచింది ఆమెకి. ఆమెకి తనపేరు తప్పు చెప్పాడు. తను పనిచేసేచోటు చెప్పలేదు-సర్వదా అతని హృదయం దొంగదారులూ, నీచ చేష్టలూ అన్వేషిస్తూనేవుంది. ఇదతనికి స్వభావసిద్ధమే. చివరికి ఎలా జరగాలో ముందుగానే ఆలోచించి చేసినదికూడా కాదు. ఇద్దరిమధ్యా సన్నిహితం హెచ్చి చెయ్యీచెయ్యీ పుచ్చుకుని తిరిగేస్థితినుంచి, చెట్ల సందుల్లో ఒకరికొకరుచేరబడి కూర్చుని ఎవరికీ తెలియని దివ్యానుభూతులను అనుభవిస్తున్నట్టు ఆనందించేస్థితికివచ్చారు. పూర్తిగా అతన్నే తప్పుపట్టడం దేనికీ? సహజంగానే జరిగినదానికి? యువతి నిజంగా ఒక పసిపిల్ల! ఆమె హృద్వేగానికర్థంగానీ, పరిస్థితుల పరిణామాలుకానీ వూహించుకోలేకపోయింది. కాని తరవాత దూషణకి పాత్రుడు అతనే. కొన్నివారాలతరువాత కన్నీటి ధారలతో భయంతో అతనిదగ్గరకి వచ్చింది ఆమె. వాడిన

పూవులా ఆమె ముఖం, రంగులేకుండావున్నా, అతన్ని పూర్తిగానమ్మింది-ఆమెకిభయంగావున్నా సరే. ఎంతో మృదువుగా మాట్లాడాడు. ఆమెకి ఏ కష్టం వచ్చినా తను ఆదుకుంటానన్నాడు. కాని యింటికి వెళ్ళి, నిద్రరాక మంచంమీద దొర్లాడు-ఇదంతా ఎందుకొచ్చింది? వెధవప్రకృతి! తనని యిలా అనవసరంగా అర్థంలేని పరిస్థితులలో పడేసినందుకు - దారుణమైన కోపం వచ్చింది. ఆమెని పెళ్ళి చేసుకోవాలని లేదు అతనికి. అసలు అప్పుడే తనకి పెళ్ళేమిటి? తనమీద తనకే ఎంతో ప్రేమ కలిగింది-ఏది ఎలావున్నా, తనకి భార్యగా కావలసింది-యిలాంటి ఆమెకాదు. చాలా చవగ్గా వచ్చింది - సాధారణమైంది. అనుకున్నాడు అందుకే తెలివైనవాడు! ఆవేళే ఆ వూళ్ళో ఉద్యోగం మానేశాడు.

అతను తల్లి ఒళ్ళోకి సురక్షితంగా తిరిగివచ్చి చేరాడు. తిరిగి యింకో ఉద్యోగం సంపాదించాడు. ఈ జరిగినదంతా మరిచేపోయాడు. అదే అతనిలోవున్న ప్రత్యేకత-అతని మెదడే రబ్బరులా పనిచేసి స్మృతిపథంమీది రాత చెరిపేస్తూ వుంటుంది! మరి ఆ యువతి?-అతన్ని కనిపెట్టలేకపోయింది. ఇంటికి తిరిగి వెళ్ళడానికి జడిసింది. అనాథ శరణాలయంచేరి ప్రసవించింది. పిల్లని అక్కడే వదిలి బయలుదేరింది. ఆ పిల్లడు శరణాలయంలో బ్రతికాడు, ఆమె జీవితం పూర్తిగా విషాదపూరితం ఐంది. కాని అతను ఆ నిర్భాగ్యురాలిని ఇప్పుడు జ్ఞప్తికేనా తెచ్చుకోలేదు-వాడిన పూవులాంటి ఆమె ముఖం ఆ ఆఖరిరోజున తన వైపు ఎత్తినప్పుడు!!

ఈ ఆకుల్లేని మోడులమధ్య త్వరితంగా నడుస్తూపోయే అతను దేన్నిగురించీ బాధ పడ్డం లేదు-ఇలా వెళ్ళడానికి అవసరం కలిగించినందుకు ఎవ్వరినో, లోపల్లోపల శాపనార్థాలు పెట్టుకుంటున్నాడు. అనవసరంగా తననుగురించి అసహ్యంగా అనుకుంటారేమో అన్నది తప్ప యింకే యితరమైన మానసికాందోళనా లేదతనికి. తను వెళ్ళిపోడం ఎవరూ చూడకుండావుంటే చాలు... ఆఖరుసారి అతనలా పారిపోయే వచ్చాడు. అప్పుడూ అతన్ని ఎవరూ చూడలేదు...కాని చాలా విచిత్రమైన పరిస్థితుల్లో ఆ సంఘటన జరిగింది...యుద్ధం రోజులవి. యౌవనోత్సాహంతో యుద్ధంలో చేరాడు. తోటి ఒక సైనికునితో గాఢమైత్రి ఏర్పడింది. ఆ సైనికుడు అతనికి తల్లికంటె ఎక్కువైనాడు. ఎన్నో ఆపదలనుంచి రక్షించాడు. రోగగ్రస్తుడైతే పరిచర్యచేసి సేదతీర్చాడు. కాని అతను? అతనూ ఎంతో ఆనందించాడు యిలాంటి స్నేహితుడు దొరికినందుకు. కాని, అతని జీవితం...ఎక్కడో ఆత్రంగా ఎదురుచూస్తున్న తల్లి దగ్గరేవుంది: అందుకే యీ స్నేహానికి అంతం వచ్చేసింది... యుద్ధం ముమ్మరంగావున్న సమయంలో స్నేహితునితో కలిసేవున్నాడు. చిట్టడవుల్లోనూ దొంగదార్లలోనూ కాపలాలు అధికంగా వున్నాయి. అలాటప్పుడే హఠాత్తుగా సంభవించింది-పొదల మాటుగా పొంచిపొంచి పోతూన్న స్నేహితుణ్ణి చూశాడు. "ఆగు" అంటే కొంచెం వెను తిరిగి చూసి, అతనేకదా అని స్నేహితుడు ముందుకు నడిచాడు. అంతే తుపాకిప్రేలుడూ, స్నేహితుని ఆర్తనాదం ఒకేసారి వినిపించాయి. కూలిపోయిన స్నేహితుణ్ణిచూస్తూ, సహాయంకోసం పిలుద్దామనే మాత్రప్రయత్నం చేశాడు కాని, చిన్నతనంలో కక్షకొద్దీ దొంగతనంచేసిన అతను-యౌవనంలో అహంభావంతో వంచించిన అతను-ఒక్కఅడుగు కూడా ముందుకి వెయ్యలేకపోయాడు. స్నేహితుడైతేమాత్రం! ఎవరూ చూడ్డంలేదు. కాపలా సైనికులు కొంచెం దూరంలోవున్నారు. అంతే, చెట్ల సందుల్లోనుంచి ఎవరికంటా పడకుండా వెళ్ళిపోయాడు. తరవాత చెప్పాడు. స్నేహితుడు తుపాకిదెబ్బ తిన్నాడని.నిజమే. స్నేహితుని మృతకళేబరం అందరికీ కనుపించింది.

ఇప్పుడు మళ్ళీ ఎవరికంటా పడకుండా పారిపోతున్నాడు...స్నేహితుణ్ణేనా జ్ఞాపకం తెచ్చుకోకుండా. అన్నిటిలాగే యీ సంఘటనా మాసిపోయింది. కాని కొన్నాళ్ళు స్నేహితునికోసం బాధపడ్డాడు. స్నేహితుడు నిండు ప్రేమతో చేసిన సహాయం, యిప్పుడు లేకపోవడం వెలితిగానే తోచింది...ఆ యుద్ధంరోజులు అయిపోయాయి. ప్రస్తుతం...యీ ఎండు మోడుల మధ్య ఎవరి కంటాపడకుండా వెళ్ళిపోతున్నాడు. "ఆ రెండో పిల్లాడు గుంటలోపడ్డవాణ్ణి రక్షించి

వుంటాడా? లేకుంటే వాడూ దానిలోపడిపోయి వుంటాడా?" వూహించి చూశాడు. వాళ్ళదే తప్పు. లేకుంటే అలాంటి చోట్ల ఆడుకోడం ఏమిటి?...ఆలోచన చేయాలని తను వస్తే—యిదంతా ఏమిటి? అతని అపజయానికి లోపల్లోపల ఏడిచాడు. తన భార్యని గురించి ఆలోచించేందుకు వచ్చేడసలు...

నిజంగా ఆవిడ అతనికి పిచ్చెత్తించింది. అతని తల్లి-వాళ్ళు పెళ్ళి చేసుకుందుకు ఒప్పుకోలేదు. తెగించి యివతలికి వచ్చేశాడు. తల్లి చివరికి భార్యతో వచ్చి తనదగ్గిరే వుండమందికాని అతను ఒప్పుకోలేదు. తనకే ఒక యిల్లు వుండాలనీ దానిలో తల్లి ప్రమేయం వుండకూడదనీ అతని వూహ. తల్లి ముఖకవళికలు చచ్చిపోయే ముందు తన స్నేహితుణ్ణి గుర్తుకి తెచ్చాయి. కాని ఓ క్షణంమాత్రమే అవి నిలిచాయి. అందుకే, తన పెళ్లి తరువాత ఆరు నెల్లు తిరగకముందే తల్లి చచ్చిపోతే ఎంతో ఆశ్చర్యపోయాడు.

ఆమె అలా చనిపోయినందుకు, అతనికి ఎంతో కోపం వచ్చింది-తనని అలా వదిలిపోతే!... కొన్నాళ్లు యుద్ధకాలపు స్నేహితుడు పోతే ఎలా వెలితిగా బాధపడ్డాడో అలాగే, తల్లినిగురించి అనుకున్నాడు ...కాని కాలక్రమాన అన్నీ మరిచాడు. కాని తన భార్య...ఇదివరలోలాగ తనని ఉత్తేజపరచడం లేదు సరికదా ప్రాణం విసిగిస్తూంది. గడిలోపడిన జీవితంఅంటే అసహ్యం వేసింది. దానికి కారణం-అతని దృష్టి-ఓ చిన్న సుకుమారి,తన జీవితం ఆనందమయం చేయగలదన్న ఒక యువతిమీద పడింది. కాని అతని భార్య? ఆమెనెప్పుడూ ప్రేమించమనీ పెళ్ళి చేసుకోమనీ అడగలేదే! తన్నెందుకిలా కట్టేసింది? చంపేస్తే! చంపేస్తే బెడదతీరుతుంది! ఈ మిట్టమధ్యాహ్నం యిక్కడకి ఏకాంతంగా వచ్చి ఆలోచనచేయడానికి కారణం యిదే. తన దారినుంచి తొలగించే ధైర్యం వుందా ఆలోచించుకుందుకే. చెయ్యలేడేమో! కొంచం ఆలోచించి చూసుకోవచ్చు

సగందారిదాకా నడిచివచ్చేశాడు. ఆ గుంట దగ్గిరనుంచి వినవచ్చే ధ్వనులు యింకో లోకంనుంచి వస్తున్నట్లున్నాయి... ఇంకో క్షణంలో అంతా అయిపోతుంది. అతను ధైర్యంగా నడవవచ్చు...ఇంతట్లోకే పదధ్వని...శీఘ్రంగా పరిగెత్తుతున్న పదధ్వని వినిపించింది. ఎవరో పరుగెట్టి వెడుతున్నారు...రక్షణకా?

దారితప్పుకుని దాక్కున్నాడు. ఎవరేనా చూస్తారని. అంతా ఐపోయాక ఆఖరిక్షణంలో పట్టుబడిపోడం బాగుండదు. పక్కకావున్న పొదల్లోకి జారపడ్డాడు. చొక్కా చిరిగింది. ముఖానికి చేతులుకప్పుకున్నాడు ముళ్ళకంపలు ముఖానికి తగలకుండా....ఆ పరుగెత్తివెళ్ళే అతను వుత్సాహంగా అరుస్తూ పరుగెడుతున్నాడు. "ఆగు. ఒక్కక్షణంలో వస్తున్నా, చెయ్యి వదిలెయ్యకు"అంటూ వెడుతున్నాడు...అతనికి నిజానికి ఆశ్చర్యంవేసింది. అనవసరంగా చిక్కుల్లో తగులుకుందు యింత ఆత్రం ఏమిటి? అని.

ఇలాంటి పరిస్థితులు కలిగించినందుకు ఆ పిల్లల మీద విసుక్కున్నాడు, తనని దారితొలగించినందుకు ఆ ఆర్తత్రాణపరాయణున్ని తిట్టుకున్నాడు...తనిలా రాడానికి కారణం అయిన తన భార్యని తిట్టుకున్నాడు. గుడ్డిగా ముందుకు పోతూన్న అతనికి తుది క్షణంలో కనువిప్పు కలిగింది. కాని లాభం! ఏదో కాలికితగిలి, అమాంతం ముందుకి పడ్డాడు. దరిదాపు నాలుగు నిలువుల లోతుకి...శరీరాన్ని రక్షించుకునే ప్రయత్నంలో ఎత్తిన ఒకచెయ్యి ముళ్ళకంపల్లోపడి, అక్కడ పడివున్న గాజుపెంకుతో కలిసింది. మణికట్టుకి పెద్దదెబ్బ తగిలి రక్తం కారుతోంది.

పరిగెత్తుకు వెళ్ళిన ఎవరో ఆగంతకుడు పిల్లలని రక్షించాడు. కాని పరిగెత్తి దారిలో కనిపించకుండా దాక్కున్న తనుమటుకు పొదలచాటున బాధపెడుతూన్న మణికట్టు చేత్తోపట్టుకుని, సర్వాన్నీ తిట్టుకుంటూ కూర్చున్నాడు. ఎవరేనా వుంటే? అతనికెవరేనా సహాయంగావుంటే బాగుండుననిపించింది—యుద్ధకాలపు స్నేహితుడేనా! తన చనిపోయిన తల్లేనా? ఉంటే! ఎంత బాగుండును... అనుకుంటున్నాడు... ఏదో తెలియని పొగమంచు కళ్ళని కప్పింది... దృష్టి సర్వత్రా ప్రసరిస్తూన్నట్లు నేత్రాలు చలిస్తున్నాయి, "ఎవరేనా సహాయం వుంటే!" అనుకున్నాడు అతను.

(ఆధారం: ఒక ఆంగ్లకథ)